క్లుప్తంగా

ఎమ్మెల్యే పెద్దిరెడ్డిని కలిసిన నేతలు

గంగవరం: పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పలమనేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి నుంచి పుంగనూరు పర్యటనకు వెళ్తున్న పెద్దిరెడ్డికి గంగవరం ఫ్లైఓవర్ వద్ద పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. తరువాత అక్కడి నుంచి పుంగనూరు పర్యటనకు బయలుదేరి వెళ్లారు.

నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ

సదుం: రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ హరిబాబు సిబ్బందిని ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. మరమ్మతులకు గురైన బోర్లను వెంటనే బాగు చేయించాలని ఆదేశించారు. అభివృద్ధి పనులపై సూచనలు ఇచ్చారు. కార్పొరేషన్ రాయితీ రుణాల మంజూరుపై సమీక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ జట్టుకు సదుం మహిళలు



ఎంపికైన గుల్జార్, రుక్సాన

సదుం: జాతీయ స్థాయి సీనియర్ మహిళా కబడ్డీ జట్టుకు సదుంకు చెందిన ఇద్దరు ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రవీంద్రరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదుం కబడ్డీ క్లబ్ క్రీడాకారులు గుల్జార్, రుక్సాన డిసెంబర్‌లో ప్రకాశం జిల్లాలో జరిగిన స్టేట్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపారని ఆయన చెప్పారు. ఈనెల 15 నుంచి హర్యానాలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ఏపీ జట్టు తరపున వీరు పాల్గొంటారన్నారు. వీరిని రిటైర్డ్ పీడీ రమణారెడ్డి, మల్‌రెడ్డి, సీనియర్ ప్లేయర్ రమేష్, శ్రీను అభినందించారు.

సచివాలయం తనిఖీ



కోగిలేరు సచివాలయంలో ఎంపీడీఓ

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు సచివాలయాన్ని ఎంపీడీఓ బాలాజి గురువారం తనిఖీ చేశారు. ఆరేళ్లలోపు పిల్లలకు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్లో నమోదు చేయించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, ఉదయం, సాయంత్రం తప్పని సరిగా అటెండెన్స్ నమోదు చేయాలని చెప్పారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని రకాల సర్వేలను సకాలంలో పూర్తిచేయాలన్నారు. అదేవిధంగా అప్పినపల్లి సచివాలయాన్ని పంచాయతీ విస్తరణ అధికారి శారదాదేవి తనిఖీ చేశారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

వి.కోట: కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన శిబిరంలో పలు వ్యాధులకు చికిత్స అందించినట్లు పేర్కొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



ఎల్లంకివారిపల్లెలో విద్యార్థులతో మాట్లాడుతున్న చిట్టెమ్మ

పులిచెర్ల(కల్లూరు): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మండల స్పెషలాఫీసర్ కె.చిట్టెమ్మ తెలిపారు. గురువారం ఆమె మండలంలోని కావేటిగారిపల్లె, ఎల్లంకివారిపల్లె హైస్కూళ్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ఎంఈఓలు సిద్దరామయ్య, తాతయ్య, హెచ్‌ఎంలు హరిశంకర్, మంజువాణి పాల్గొన్నారు.

చెత్త రికార్డు!

- నత్తనడకన బయో ఎనర్జీ ప్లాంట్
- నిరుపయోగంగా వ్యర్థాలు

పలమనేరు: పట్టణ సమీపంలోని మున్సిపల్ డంపింగ్ యార్డులో బయో ఎనర్జీ ప్లాంటు పనులు మొదలై ఎన్నో ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాలేదు. దీంతో పట్టణం నుంచి నిత్యం పోగయ్యే చెత్త డంపింగ్ యార్డులో పేరుకుపోతోంది. ఇందుకోసం అవసరమైన స్థలం సదుపాయాలను క్యాబ్ సంస్థ నిర్వాహకులకు స్థానిక మున్సిపల్ అధికారులు గతంలోనే చూపెట్టారు. ఈ పనులు ప్రారంభం కానున్నాయని చెప్పి ఏళ్లు గడుస్తున్నా ఫలితం లేదు. మున్సిపాలిటీకి ఎక్కువ లాభాలు కలిగే ఈ ప్రాజెక్టు పనులు నత్తను తలపిస్తున్నాయి.

పథక లక్ష్యమిదీ

స్వచ్ఛభారత్‌లో భాగంగా చెత్తనుంచి విద్యుత్‌ను తయారు చేసే ప్రాజెక్టులను అప్పటి ప్రభుత్వం 2015 అక్టోబర్‌లో టెండర్లను పిలిచింది. స్థానిక మున్సిపాలిటీలో ఈ పనులను క్యాబ్ సంస్థ దక్కించుకుంది. ఇందులో భాగంగా పట్టణంలో రోజూవారి పోగయ్యే చెత్తను(సాలిడ్ వేస్ట్) ప్లాంటుకు మున్సిపాలిటీ వాహనాలతో పంపుతున్నారు. వేస్ట్ టూ ఎనర్జీ ప్రాజెక్టులో ఉత్పత్తి అయిన పవర్‌ను పవర్ సప్లై కంపెనీలకు సంస్థ విక్రయిస్తుంది. దీంతో వ్యర్థ పదార్థాలను సమర్థవంతంగా వినియోగించుకున్నట్లు అవుతుంది. స్థానిక డంపింగ్ యార్డులో చెత్తసేకరణ, వేరుపరుచుట, భద్రపరుచుట, ప్రాసెసింగ్, డిస్పోజ్ యూనిట్లున్నాయి. ప్లాంట్‌కు అవసరమైన నీటి వసతి కూడా ఉంది. నిర్వాహకులు ప్లాంటు నిర్మాణాన్ని త్వరగా చేపట్టకపోవడంతో దీనిపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.



యార్డులో పేరుకుపోయిన వ్యర్థాలు



పలమనేరులోని డంపింగ్ యార్డు

నిర్మిస్తే మున్సిపాలిటీకి ప్రయోజనమే

ఈ ప్లాంట్ నిర్మాణం జరిగితే మున్సిపాలిటీకి లాభముంటుంది. దీంతోపాటు వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం తప్పుతుంది. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపడుతుంది. వ్యర్థ పదార్థాల నిర్వహణలో స్థానిక సంస్థలకు ఆర్థిక ప్రోత్సాహకాలు లభిస్తాయి. ప్లాంట్‌లో పీఎల్‌ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) 75శాతం కంటే ఎక్కువైతే 20శాతం లాభాలు మున్సిపాలిటీకి చేరతాయి. ఏదేమైనా ఈ ప్లాంటు నిర్మాణానికి అధికారులు చొరవ చూపాల్సి ఉంది. ఈవిషయమై స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని వివరణ కోరగా ఈ ప్రాజెక్టుకు సంబంధించి పనులు త్వరలో పూర్తికానున్నాయి. అంతవరకు ఇబ్బంది తప్పదు. ప్రస్తుతం పట్టణంలో నిత్యం ఏడు టన్నుల చెత్తను డంపింగ్ యార్డుకు పంపుతున్నాం.

భూమి స్వాధీనం చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధితులు

గంగవరం: ఆక్రమిత భూమిని తమకు స్వాధీన పరిచి న్యాయం చేయాలంటూ మండలంలోని రెంటకుంట్ల గ్రామానికి చెందిన బాధితులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. బ్యానర్ పట్టుకుని ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ గంగవరం పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 346/2ఏలో విస్తీర్ణం 11.13 ఎకరాల భూమిలో 3.66 ఎకరాల భూమిని గంగవరం –2 ఎంపీటీసీ కుటుంబసభ్యులు ఆక్రమించేందుకు పాల్పడుతున్నారని బాధితులు ఆవేదన చెందారు. మొత్తం భూమిలో సరసమ్మ, లక్ష్మమ్మ, శివకుమార్, సుబ్రమణ్యం, పద్మావతి, ధనలక్ష్మి భాగస్వాములుగా ఉన్నామన్నారు. అందులోని కొంత భూమిని ఎంపీటీసీ కుటుంబసభ్యులు ఆక్రమించగా అడిగితే తమపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కావున రెవెన్యూ అధికారులు స్పందించి తమ భూమిని ఎలాగైనా తమకు స్వాధీనపరిచి తమకు న్యాయం చేయాలని కోరారు.

వైభవం.. వేణుగోపాలుడి దోపోత్సవం



పుష్పాలంకరణలో శ్రీ వేణుగోపాలుడు

వి.కోట: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజైన గురువారం స్వామివారి దోపోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉభయదారులు యల్లప్ప, తనకంటి రమేష్ ఆధ్వర్యంలో స్వామివారిని ఉత్సవమూర్తులుగా కొలువు దీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. స్వామి వారికి మహిళలు హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి పట్టణ కిరాణా వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో దోపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఉభయదారులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ ధర్మకర్త సీతారామయ్య పాల్గొన్నారు.

ముగిసిన రథోత్సవం..

వేణుగోపాలస్వామికి నిర్వహించిన రథోత్సవ కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం ప్రారంభమై రాత్రి 12 గంటల వరకు కొనసాగింది. స్వామి వారు కొలువు దీరిన రథం పట్టణ పురవీదుల్లో జనసందోహం మధ్య ముందుకుసాగింది. స్వామి వారి దర్శనార్థం పట్టణంలో ప్రజలు బారులు తీరారు. రథం ముందు ఏర్పాటు చేసిన బుట్టబొమ్మలు, కీలుబొమ్మలు, డీజే డ్యాన్సులు భక్తులను అలరించాయి. పట్టణంలో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా పోలీసులు గట్టి బందోభస్తును ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు రథాన్ని లాగుతూ అడుగడుగునా స్వామి వారికి హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

మదర్ థెరిసా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపల్

పెద్దపంజాణి: ఇటీవల చెన్నై వీఐటీ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఆరవ జాతీయ రోబోటిక్ పోటీల్లో మండలంలోని మదర్ థెరిసా పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల కరస్పాండెంట్ డా.రవీంద్రబాబు తెలిపారు. వీరిలో శివరాజ్ ప్రథమ, మోహన్‌కృష్ణ ద్వితీయ బహుతులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. కరస్పాండెంట్ రవీంద్రబాబు, ప్రిన్సిపల్ డేవిడ్ బర్క్‌మన్ విద్యార్థులను అభినందించారు.

బతకనంటూ సూసైడ్ నోట్ రాసి..

- తల్లడిల్లిన తండ్రి
- సాయంత్రానికి ఇంటికి చేరిన యువకుడు

పలమనేరు: తన కొడుకు ఇంట్లో సూసైడ్ నోట్ రాసి పలమనేరు అంబేడ్కర్ సర్కిల్ వద్దకు వచ్చి ఆపై కనిపించ లేదని ఓ కొడుకు రాసిన లెటర్‌ను స్థానిక విలేకరులకు చూపి కంటనీరు పెట్టుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. అయితే సాయంత్రానికి మనసు మార్చుకున్న ఆ యువకుడు ఇంటికి చేరడంతో విషాదం సద్దుమణిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. బైరెడ్డిపల్లి మండలం గంగినాయనిపల్లికి చెందిన మేస్త్రీ కృష్ణప్ప కుమారుడు విశ్వనాథ్ అక్కడి ఓ సంస్థలో తాత్కాలిక ఉద్యోగం చేసుకునేవాడు. ఏమైందో గానీ జీవితంపై విరక్తి చెంది తాను బతకనని ఓ సూసైడ్ లెటర్ రాశాడు. అందులో తన అప్పులు, రావాల్సిన ఇన్సూరెన్స్‌లు, చంద్రన్న బీమా తదితరాలు అందగానే ఏమి చేయాలో సైతం వివరించాడు. తన భార్య, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని కోరాడు. ఈ సూసైడ్ లేఖను చూసిన తండ్రి తల్లడిల్లిపోయాడు. అయితే కొడుకు ఇంటికి చేరాడనే వార్త తెలియగానే చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుని వెళ్లిపోయాడు.

కొయ్యల డిపోలో మంటలు

పుంగనూరు: పట్టణంలోని ఎన్‌ఎస్‌పేటలో ఉన్న కొయ్యల డిపోలో బుధవారం రాత్రి మంటలు చెలరేగాయి. వెంటనే ఆ ప్రాంత వాసులు కనుగొని ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజుకు సమాచారం అందించారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. కొయ్యలు ఎక్కువ భాగం కాలిపోయాయని, అంచనాలు వేయాల్సి ఉందని ఈ సందర్భంగా అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు.

కమ్యూనిటీ స్థలం స్వాధీనం



వెంచర్‌లో ప్రభుత్వ స్థలాన్ని కొలిచి స్వాధీనం చేసుకుంటున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని జేఎస్ నగర్‌లో సర్వే నం.297లోని ఓ లేఔట్ వెంచర్‌లో నిబంధనల మేరకు కమ్యూనిటీ స్థలాన్ని వదల లేదని ఫిర్యాదులందడంతో స్థానిక కమిషనర్ రమణారెడ్డి ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం సర్వే చేసి 39 సెంట్ల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా వెంచర్లు వేస్తే కచ్చితంగా లేఔట్ నిబంధనలు పాటించి మొత్తం స్థలంలో కమ్యూనిటీ కోసం నిర్దేశించిన స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించాలని వారు సూచించారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని అడ్డుకుంటాం

పుంగనూరు: ముస్లింల హక్కులకు, ఆస్తులకు విఘాతం కలిగించే వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను అడ్డుకుంటామని స్థానిక ఎస్‌డీపీఐ నాయకులు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ఇందిరా సర్కిల్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా చేపడుతున్న వక్ఫ్ బోర్డు చట్ట సవరణ ప్రతులను కాల్చి నిరసన తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్లకు బహుమతులు

పుంగనూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు ఇంధనం పొదుపు చేయడంతో వారికి బహుమతులు పంపిణీ చేసినట్లు మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. గురువారం డ్రైవర్లు డీఏ ఖాన్, అన్వర్, రెడ్డెప్ప, సురేష్‌లకు బహుమతులు అందించామన్నారు. కార్యక్రమంలో డిపో అధికారులు పాల్గొన్నారు.

షబేరాత్‌కు ఏర్పాట్లు

పుంగనూరు: రంజాన్ పండుగ ముందు ముస్లింలు నిర్వహించే పెద్దల పండుగ షబేరాత్‌కు గురువారం అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా తమ కుటుంబాల్లో మృతిచెందిన పెద్దల ఆత్మ శాంతించేందుకు ముస్లింలు షబేరాత్‌ను రాత్రి ఉపవాస జాగరణ దీక్షలతో నిర్వహించారు.

నియోజకవర్గ సీపీఐ కన్వీనర్ నియామకం





చెన్నకేశవులు, బుర్రా మంజునాథ్

పలమనేరు: సీపీఐ నియోజకవర్గ కన్వీనర్‌గా సీనియర్ నాయకులు చెన్నకేశవులు, కో–కన్వీనర్‌గా బుర్రా మంజునాథ్ నియమితులయ్యారు. ఆమేరకు ఆపార్టీ జిల్లా నాయకులు నాగరాజు ఆధ్వర్యంలో గురువారం ఆపార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చక పోవడంతో తాము పోరాటాలకు సిద్ధమని తెలిపారు. ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు.

మసెమ్మ.. కరుణించుతల్లీ!

- కోలాహలంగా జాతర
- వేలాది మంది భక్తుల రాక



ప్రత్యేక పూజలందుకున్న మసెమ్మ

పుంగనూరు: మండలంలోని కురప్పల్లెలో గురువారం మసెమ్మ జాతర కోలాహలంగా జరిగింది. బుధవారం రాత్రి అమ్మవారిని గ్రామంలో ఊరేగింపు చేసి, భక్తుల దర్శనార్థం ఆలయం వద్ద నిలిపారు. వేలాది మంది భక్తులు మసెమ్మను దర్శించుకుని జంతు బలులు సమర్పించారు. ప్రతి ఇంటిలోనూ బంధుమిత్రులతో విందు భోజనాలు నిర్వహించి సరదాగా గడిపారు. 30 గ్రామాల ప్రజలతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి అమ్మవారిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి, నిమజ్జనం చేశారు. మసెమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.



హాజరైన జనం

టెన్త్ స్టడీ మెటీరియల్ పంపిణీ

బంగారుపాళెం: తుంబపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ శాఖ తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను ఆశాఖ మాజీ మండల అధ్యక్షుడు మొగిలయ్య ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిట్టెమ్మ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించేది పదో తరగతి పబ్లిక్ పరీక్షలేనని గుర్తుచేశారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అందుకు ప్రణాళికా బద్ధంగా కష్టపడి చదవాల్సిన అవసరం ఉందన్నారు. యూటీఎఫ్ శాఖ వారు 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. మాజీ సర్పంచ్ కోదండయాదవ్, ఉపాధ్యాయులు గంగాభవాని, బాబు, గిరిధర్ నాయుడు, అమరేంద్ర, రీటా, దామోదరంనజ్మ పాల్గొన్నారు.

భార్య అవమానించిందని..



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొండప్ప

పుంగనూరు: పట్టణంలో ఓ వ్యక్తి తన భార్య అవమానించిందని మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. మేలుపట్లకు చెందిన కొండప్ప, మారి దంపతులు ఘర్షణ పడ్డారు. దీంతో భార్య మారి పుట్టింటికి వెళ్లింది. దీనిపై భర్త కొండప్ప భార్యను కాపురానికి రమ్మని అత్తారింటికి వెళ్లి భార్యను కోరాడు. భార్య రాకపోగా, అత్తమామలతో కొట్టించిందని ఆరోపిస్తూ మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబీకులు గమనించి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోండి





మేకలవారిపల్లెలో 104పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వినయ్, కొండారెడ్డిగారిపల్లెలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రొంపిచెర్ల: గ్రామాల్లో 104 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వినయ్ అన్నారు. ఆయన గురువారం పెద్దగొట్టిగల్లు గ్రామ పంచాయతీలోని మేకలవారిపల్లె, కొండారెడ్డిగారిపల్లె, శ్రీనాథపురం కాలనీ, మిట్టమీద పల్లె, బోనంవారిపల్లె, గ్రామాల్లో 104 సేవలపై ప్రజలకు అవగాహన కల్పించి ఉచిత వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల కోసం 104 వాహనాల ద్వారా వైద్య సేవలు అందిస్తోందన్నారు. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా పరీక్షలు చేసి మందులను ఇస్తామని అన్నారు. క్రమం తప్పకుండా బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలను ప్రతిఒక్కరూ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం అరుణ, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీవిద్య, డీఈఓ సూర్య, ఆశా కార్యకర్త యశోద పాల్గొన్నారు.

హైదరాబాద్ నుంచి బైరెడ్డిపల్లికి!

- జగన్నాథగౌడను ఇంటికి తీసుకొస్తున్న అన్న
- గత కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో హల్‌చల్



హైదరాబాదులోని అనాథాశ్రమంలో తమ్మునితో అన్న వాసు

పలమనేరు: హైదరాబాద్‌లోని మాతృదేవోభవ అనాథాశ్రమానికి చేరిన బైరెడ్డిపల్లి మండలం పాతూరునత్తానికి చెందిన ఓ యువకుడి వీడియో ఇటీవల హల్‌చల్ చేస్తోంది. తమ ఆధీనంలో ఉన్న యువకుడిని వారి కుటుంబీకులు తీసుకెళ్లాలని దీనిపై అందరూ షేర్ చేయాలని అక్కడి నిర్వాహకులు తెలిపిన విషయం తెలిసిందే. ఈ విషయం ఎట్టకేలకు కుటుంబీకులకు తెలిసి హైదరాబాద్‌లో ఉంటున్న యువకుడిని తీసుకొచ్చేందుకు అతని అన్న వెళ్లి గురువారం తన వెంట తీసుకొని స్వగ్రామానికి బయలుదేరారు. ఇందుకు సంబంధించిన వివరాలేమంటే.. బైరెడ్డిపల్లి మండలం, పాతూరునత్తానికి చెందిన క్రిష్ణప్ప, లక్ష్మమ్మ భార్యాభర్తలు. వీరికి వాసు, జగన్నాథగౌడు అనే ఇద్దరు పిల్లలు. తండ్రి క్రిష్ణప్ప మృతితో ఆ కుటుంబం కష్టాలపాలైంది. ఈ నేపథ్యంలో లక్ష్మమ్మ తన పుట్టినిల్లు రామనపల్లికి చేరింది. అక్కడ కూలీ చేసుకుంటూ పిల్లలను పోషించింది. రెండో కుమారుడైన జగన్నాథగౌడు లక్కనపల్లి హైస్కూల్‌లో టెన్త్ పూర్తి చేసి ఆపై పలమనేరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదివాడు. ఉద్యోగం కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ ఏం జరిగిందోగానీ మానసికంగా ఇబ్బందులు పడుతూ తిరిగి స్వగ్రామానికి చేరుకున్నాడు. కొన్నాళ్లు గ్రామంలో ఉంటూ నెల క్రితం ఇంట్లో తల్లికి చెప్పకుండా మళ్లీ హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ వీధుల్లో తిరుగుతుండగా అనాథాశ్రమానికి కొందరు తీసుకెళ్లారు. కొన్నాళ్ల పాటు మౌనంగా ఉంటూ వచ్చిన జగన్నాథగౌడు తన చిరునామాను అక్కడి నిర్వాహకులు తెలపగా వారు ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. దీన్ని గమనించి అతని అన్న వాసు హైదరాబాద్ వెళ్లి సోదరుడిని తీసుకొస్తున్నట్టు తెలిపారు.